

# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

అక్టోబర్ 2012

సంపుటి : 18 (213) సంచిక : 10



## ఆంధ్రను అంధకార భూమిని చేయకండి!! ఆంధ్రులను అన్నమో రామచంద్రా యనిపించకండి!!

### - రాజకీయ నాయకుల్లారా మంత్రదండం మీ దగ్గరనే ఉన్నది -

ఆంధ్రభూమి బంగారం పండించిన బంగారు భూమి. భారతదేశానికిది బంగారుగని. తెల్లదొరలూ, (మ) నల్ల దొరలూ దోచుకున్నప్పటికినీ తరగని 'సిరి'గల భూమిజ. ఏఁవి తల్లీ! ఈ అతలాకుతల పరిస్థితులూ అను నిత్య నరకాలూ తప్పవా తల్లీ! తండ్రీ పరమేశ్వరా! పరవాడివి కాకుము.

**భయంలేని మనసు- వంచని శిరస్సు**
**ఉన్ముక్తజ్ఞానం-ఎచటనుండునో!**
**సంకుచితభావములతో-సమాజమెచ్చటఛిన్నాభిన్నం కాదో!**
**వాక్కులెచట సత్యపు లోతులనుండీ వెలువడునో!**
**విరామమెరుగని- కర్మధారలెచట**
**పరిపూర్ణతకై చేతులు చాచునో!**
**వివేకమనెడు- నిర్మల ప్రవాహం**
**దురాచారముల మారుభూములలో ఇంకని తావేదో!**
**నీ నేతృత్వంలో మనసు ఎచట**
**సదాక్రమముగా విస్తరించే ఆలోచనలలో పనులలో నిమగ్నమై ఉండునో!**
**అట్టి స్వతంత్ర స్వర్గసీమగా**
**నా దేశం మేలుకొనునుగాక!**
**అని అర్థించారు రవీంద్ర కవీంద్రులు.**
**ఆంధ్రదేశం విషయానికొస్తే-**
**ప్రాచ్యదేశాంధ్ర శ్రీ మహాభారతమ్ము**
**భవ్య తెలంగాణా శ్రీ మహాభాగవతమ్ము**
**మహితరాయలసీమ రామాయణమ్ము**
**ఘనత్రివేణీ సమాగమాకారమూనె!**

- ఆంధ్రులు నివసించే భూమి యెంతటి పవిత్రభూమి. ఆంధ్రుల పురాకృత పుణ్యఫలంగా మహాకావ్యాలు, మహాభారతం, భాగవతం, రామాయణం- అను మూడు కావ్యాలూ ఆంధ్రమాతకు యుప్పేటగా అలుముకున్నజడకుచ్చులు. (ఇప్పుడు జడలు వేసుకొనేవారు అంతగాలేరు ఆరోజుల్లో, జడలులు వేసుకునేవారు వెనుక నిడుపుగా ఉన్న శిరోజాలను మూడు సమ పాయలుగా తీసి ఒక్కటిగా అల్లుకునే వారు) చిత్రమేమంటే ఈ మూడు మహత్కారాణాలూ ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ కవుల కలం నుంచీ వెలువడ్డాయ్. వాగ్గేయకారులు క్షేత్రయ్య రామదాసు, అన్నమయ్యలు ఆంధ్ర, తెలంగాణా, రాయలసీయ నుంచీ జనించి, పావనభక్తి సంకీర్తనలతో ప్రజల హృదయాలను పవిత్ర భావాలతో పొంగింపచేశారు.

**తెలుగన్ని విద్దెలను గరిపెడు బాసగా- అయిన 'నాడు' మనది తెలుగునాడు!**
**పనిమంతుడెవ్వడును ఏఁ లేమికి గురికానినాడు, మనది తెలుగునాడు!**
**భారతీవని ప్రగతి భావనా బలముతో మెలగునాడు మనది తెలుగునాడు!**
**ఆంధ్రాభ్యుదయమ్ము అందరమేలు గన్ననాడు మనది తెలుగునాడు!**
**మనిషి మనిషిగ బ్రతకవీలు సాకర్యమ్ము ఉన్ననాడు తెలుగునాడు!**
**మూడు ప్రాంత కవులు ముక్త కంఠముతో ముగ్ధనాదం ముదముగా చేశారు!**

త్యాగుల తరం అంతరించి, భోగుల తరం వచ్చేసరికి ప్రజాస్వామ్య మంత్రాగ మంతా చెల్లాచెదరమైపోయింది. గ్రామాలు కబళింపబడ్డాయ్. ఆ కాలంలో రాజులు తవ్వించిన చెరువులన్నీ చేపల చెరువుల్లా కంపు వాసన కొడుతున్నాయ్. ఆ కంపు రాజకీయాల తలకెక్కింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. వృత్తి కుల కట్టుబాటులు సడలిపోయాయి. యంత్రయుగం వచ్చింది. యంత్రయుగపు నరుడు రాక్షసుడయ్యాడు. మనల్ని జీవింపచేసే తరువులు, గిరులు, నదీనదులు కనుమరు గయినాయి. తనను పెంచుతున్న ప్రకృతిని చెరుస్తూ, మనిషిలో దోచే దోషగుణం పెరిగి పోయింది. కన్నతల్లినీ, తండ్రినీ పుట్టిన ఆడబిడ్డను చంపే దుస్థితికి మనిషి వచ్చాడు. ఆత్మహత్య కూడా చేసుకుంటున్నాడు. ఇరుగు పొరుగుల వైషమ్యం పెరిగింది, ప్రాంత వైషమ్యం పెరిగింది. కులాల కలహం. అన్నపూర్ణలా భాసిల్లిన ఆంధ్రదేశం మరుభూమి కావించే రాక్షసత్వం, క్రూరత్వం, బంద్‌లు, రాకారాకోలు, ధ్వంస విధ్వంసాలూ!న్ని ఘోరాలు కోరలు విప్పాయో. చిన్నప్పట్నుంచీ నీతి కథలు వళ్ళించే తల్లితండ్రులు లేకపోవడం, గురువులు ఘాతకులు కావడం!



**యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతా!**
**అభ్యుత్థాన మధర్మస్సతదాఽత్మానం**
**సృజమ్యహమ్!**

-గీతాచార్యుడన్నట్లు పాపకర్మలు పండిన కాలం వచ్చింది. ధర్మానికి గ్లాని వచ్చింది. అవి నీతి, అధర్మం మితిమీరింది. ధర్మాన్ని పునఃస్థాపనంచేసే పరంధాముడే పుట్టాలేఁమో!

**మంచినే ఆశిద్దాం. మంచికే పాటుపడదాం.**

బుధజన విధేయుడు

*గోటేటి శ్రీరామారావు*

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

అన్నమో రామచంద్రా అని కొందరు
అంధకార రాత్రుళ్ళతో కొందరూ, రాలిపోతున్నారు.
భారతదేశంలో తొలి అమ్మగా అన్నపూర్ణగా తల్లిప్రేమను పంచిన అమ్మ

# జిల్లెలమూడి 'అమ్మ'.


## అమ్మ చేతి ముద్దను తిన్నవాణ్ణి నేను!

**ఆంధ్రదేశమా అన్నమో రామచంద్రా అనిపించకే! పుట్టిన ఆడపిల్లలను పుట్టిన నాడే పీకలు పిసికి చంపకే! అధర్మమా! నీవు పెరుగుతూ, అడపిల్లలనూ పుట్టిపుట్టగానే పరిమార్చుతావా? అమ్మా! నీవు తిరిగి పుట్టాలి! ఆడపిల్లల్ని రక్షించాలి!**

**ఆదిలక్ష్మి వంటి 'అన్నపూర్ణ' వమ్మా! సేవాలంది మాకు శుభమూలొసగవమ్మా!** ఆంధ్రదేశం యావద్భారతదేశానికీ అన్నపూర్ణవంటి 'అమ్మ'. అలాటి 'తల్లి'ని మరిచిపోతున్న తరుణంలో జిల్లెలమూడిలో ఓ 'అమ్మ' అర్థశతాబ్దికిపైగా జీవించి, అందరికీ 'తల్లి' ప్రేమను పంచింది. ఆమె ఇల్లును **అందరి ఇల్లు** అనడమే కాదు, కులమత జాతిబేధములు లేకుండా అందరికీ ప్రేమను పంచింది. ఏ భేషజాలూ లేని అమ్మ, ఏ ఆర్భాటాలు చూపని అమ్మ, ఏ ఉపన్యాసాలు చేయని అమ్మే ఆ **అమ్మ అనసూయమ్మ.** పేరులోనే కాదు, తన ప్రేమను పంచి యివ్వడంలో అసూయ లేని అమ్మ అనసూయమ్మ. అన్నపూర్ణాలయం ప్రారంభించి, నిరవధికంగా నిత్యాన్న సంతర్పణ చేసిన 'అమ్మ'. నిత్యాన్నదానం అంటే ఒప్పుకొనేది కాదు. నా బిడ్డలకు అన్నం పెట్టుకోవడం దానమెలా అవుతుంది. వాళ్ళ బుజ్జిబొజ్జలను నింపడం నా బాధ్యత కాబట్టి అన్నాన్ని నా బిడ్డలకు పెట్టుకుంటున్నాను. అందరూ నా బిడ్డలే అన్నది.

నేనూ నా భార్యతో కలిసి, జిల్లెలమూడి వెళ్ళి, అమ్మ చేతిముద్దలు తిన్నాను; అన్నపూర్ణాలయంలోనూ భుజించాను. అక్కడ భోజనం ఎంతో రుచిగా ఉంది. అప్పట్నుంచీ ఇప్పటి వరకూ అంతరుచికరమైన భోజనాన్ని చేయలేదు. అది అనసూయమ్మ చూపే అమిత వాత్సల్య మహిమే అయ్యుండాలి. ఆ 'అమ్మ' రాకడతోనే, దేశంలో ఎందరో 'అమ్మ'లు వచ్చారు. కానీ ఆ అమ్మ వాత్సల్యమే వేరు. ఎందరో మహానుభావులు ఆమె చేతి ముద్ద తిన్న వారే! అందుకే వారందరూ మహానుభావులు అయ్యారనుకుంటున్నా. ఆ 'అమ్మ' లా ఎవ్వరూ నిరతాన్న సంతర్పణలు చేయలేదు, చేయడంలేదు. అది ఆ 'అమ్మ' ఒక్కరికే సాధ్యమయింది.


రా! రా ముద్దుతనయా అని పిలిచే అమ్మ


ప్రశాంతమైన మోము భృగిటిలో సూర్యబింబం వంటి బొట్టు! ఆ రోజుల్లో అమ్మలందరూ సాంప్రదాయంగా ధరించే అడ్డ పాస, ఆ అమ్మకే చెందింది.

ఎన్నివేలూ, లక్షల మంది భోజనం చేసి కుక్షినినింపుకున్నారో! లక్షలు అంటే స్ఫురణకు వచ్చింది. ఆ 'అమ్మ' 50వ పుట్టిన రోజుకు కొందరు 'అమ్మ' ఒడి వాత్సల్యం పొందిన వారొచ్చి, నీ 50వ పుట్టిన రోజు నెలా జరుపుకోమంటావమ్మా! అంటె నాకేంవీ వద్దు. ఓ లక్ష మందికి ఒకే పంక్తి భోజనం పెడితే సంతోషంగా ఉంటుందిరా అన్నది. అలాగే పాకలూ పందిళ్ళు వేసి ఒకే సమయంలో లక్షమందికి భోజనం పెట్టారు. వాళ్ళు భుజించడం చూచి అమ్మ ఎంత ఆనందం పొందిందో ఆ 'అమ్మ'? ఇప్పుడా 'అమ్మ' లేదు. కానీ జిల్లెలమూడిలో ఆ 'అమ్మ' ఇల్లు అందరి ఇల్లుగ నిరతన్న సంతర్పణ జరుగుతూనే ఉంది. 'అమ్మ' పేరిట అనేక చోట్ల 'అమ్మ'కు గుడి కట్టి పూజిస్తూనే ఉన్నారు. అమ్మా! నీవిప్పుడెక్కడ ఉన్నావమ్మా. నీవు లేనందున ఆంధ్రదేశంలో అన్నం కోసం అల్లాడుతున్నారమ్మా. ఆదీలక్ష్మి వంటి అన్నపూర్ణవమ్మా! సేవాలంది మాకు శుభములీయవమ్మా. ●

*If you want Comfortable Stay-*
*Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114



# వెదురుపాక 'గాడ్'గారిని సత్కరించిన సద్గురు శివానందమూర్తి మహోదయులు!!!

## - ఇరువురూ నాకు రెండు నేత్రములు -





వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతులు 'గాడ్' గారెంతటి ప్రేమస్వరూపులో, భీమిలిలోని ఆనందవనం సద్గురువులూ, శివ స్వరూపులైన కందుకూరి శివానందమూర్తి మహోదయులంతటి ప్రేమమూర్తులు. ప్రేమించడం, ప్రేమింపబడడంలో ముందు మార్గదర్శియైన జగద్గురు శ్రీకృష్ణమూర్తి పుట్టినరోజున సికిందరాబాదులోని 'తివోలీ గార్డెన్స్'లో ప్రేమమూర్తులైన సద్గురువులు శ్రీ కందుకూరి శివానందమూర్తులైన సద్గురువులు శ్రీ కందుకూరి శివానందమూర్తి మహోదయులు, మరో ప్రేమమూర్తి 'వెదురుపాక గాడ్'గా విజయదుర్గాను గ్రహంతో విశ్వకీర్తినార్జించి, ప్రేమను పంచుతున్న 'గాడ్'గారిని సత్కరించడం 'ప్రేమ'ను 'ప్రేమ' సత్కరించి నట్లేనని భావిస్తున్నాను.

**పరోపకృతి కైవల్యే తోలయిత్వాజనార్దనః**
**గుర్వీముపకృతిం మత్వా అవతారాన్దశాగ్రహీత్ ।**

- కైవల్య పరోపకారాలు రెండింటినీ తులాదండంలో పరోపకారమునే గురుతుల్యంగా భావించి జనార్దనుడు పరోపకారార్థమై దశావతారములు అవధ నవతరించాడని శృంగేరీ జగద్గురు భారతీ తీర్థ మహాస్వాములు ప్రవచించినట్టు - ఆ జనార్దనుడు 'సద్గురు శివానందమూర్తి, వెదురుపాక గాడ్'గా అవతరించారని అనుకుంటాను.

ఇరువురూ ఆర్తులనూ, కళాసాహితీవేత్తలనూ ఆదరిస్తారు. లోకంలోని ప్రేమంతా వారిద్దరిలోనే కొలువై ఉండిపోయింది. వారిరువురికీ యివ్వడానికే రెండు చేతులూ ఉన్నాయ్. శివానందమూర్తిగారి వదనంలో చిదానందం, గాడ్‌గారి మోములో సదానందం తొలక రిస్తూంటాయ్, గాడ్‌గారు తన భక్తులను, అబ్బాయి అల్లుడూ, బావగారు - అని తక్కవేతే పిలుపు పిలవరు. ఈ ఇరువరిలోనూ మాతృ హృదయం ఉన్నది. ఇరువుర్నీ అంకిత మనస్సుతో అంజలి ఘటిస్తున్నాను. ●

## ముఖపత్ర దేవత : శృంగేరి శారదాదేవి!





శృంగేరీ శారదాపీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వాములవారి చాతుర్మాస్య దీక్ష చెన్నయ్ మహానగరంలో వైభవంగా జరిగింది!!

అనుగ్రహ భాషణములు పండిత సదస్సులు సత్కారములతో శారదాదేవి ఉల్లం దివ్య తేజోభరితమైంది!


తిరుమలయందు బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవములు కాణిపాకమునందు స్వయంభూ వినాయకుని బ్రహ్మోత్సవములు, చెన్నయ్ మైలాపూర్‌లోని 'సువిధ'లో శృంగేరీ జగద్గురు పీఠాధీశులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి చాతుర్మాసదీక్షలో అధిష్ఠాన దేవత శారదా దేవికి ఆగష్టు, సెప్టెంబర్ మాసాల్లోని అన్నిరోజులూ, పీఠ అధిష్ఠాన దేవత శ్రీ శారదాదేవికి భారతీ తీర్థ మహాస్వాములు జరిపిన పూజల్ను చూచినపుడు దేవీ నవరాత్రములందు శరత్కాల శశాంకునిలా, వేవేల సూర్యుల కిరణకాంతులతో అమ్మవారు దివ్య తేజస్సుతో వేలాది భక్త జనులకు దివ్యదర్శనం కల్గింది. ఆదిశంకర భగవత్పాదులచే ప్రతిష్ఠింపబబడిన శారదాదేవి, విద్యారణ్యుల కాలంలో సువర్ణమై, తళతళ మెరుస్తూ, కాసుల వర్షం కురిపించిన ఆ తల్లి ముక్కోటి దేవతల ముగ్ధమణిహారంగా, జ్ఞానవన్నెలు వెదజల్లుతూ ప్రతీ రాత్రి వసంత రాత్రి అన్నట్టు భక్తులను పరమానందంతో భక్తి పారవశ్యతను ప్రవహింపచేసింది. 'సువిధ' ప్రాంగణం బ్రహ్మలోకంగా వరలి, ప్రతీరోజూ బ్రహ్మోత్సవ రాత్రుల్లా భాసిల్లిన ఆ ప్రదేశం కైలాసమా, శృంగేరియా అన్న అనుభూతిని కలుగచేసింది.

చెన్నయ్‌లో నిత్యకల్యాణం పచ్చతోరణంలా జరుగుతున్న యీ చాతుర్మాస దీక్షా మహోత్సవంగా, శృంగేరీ శారదమ్మ తల్లి బ్రహ్మోత్సవమా అన్నట్టు దీప్తిచెందింది. ఉభయవేళలా వచ్చిన వేల భక్తులకు షడ్రసోపేత ప్రసాద భోజనం పెట్టడం భక్తులందర్నీ పరవశుల్ని చేసింది. ●

### గోటేటి శ్రీరామారావును శృంగేరీ జగద్గురువులు సత్కరించారు

ఈ సందర్భములో శృంగేరీ శంకర భగవత్పాదులైన శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారు ప్రముఖాంధ్ర సంపాదకులు గోటేటి శ్రీరామారావును చూచి - మీరు ఈరోజు వస్తారనే అనుకుంటున్నాను. రానిచో మిమ్మల్ని పిలిపించాలనుకుంటున్నాను - అంటూ మధురమందహాసంతో పట్టుశాలువ కప్పుతూ, మంత్రాక్షతలను, ఫలప్రదానం చేయడం దీర్ఘాయురారోగ్యమస్తు అంటూ దీవించడం, అక్కడున్న వారందర్నీ ఆనందకందితుల్ని కావించింది.

# హరిజనుల దేవాలయ ప్రవేశానికి తొలికృషి చేసిన నిష్కళంక దేశభక్తుడు
# కొండా వేంకటప్పయ్య పంతులు!



కొండా వెంకటప్పయ్య పంతులు

కొండా వేంకటప్పయ్య పంతులుగారు గుంటూరులోని శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబములో 1866సం॥ము ఫిబ్రవరి 2న జన్మించారు. స్వతంత్ర భావాలు కలవ్యక్తి. న్యాయవిద్యా పట్టానందుకుని మచిలీపట్నం చేరి న్యాయవాద వృత్తిని చేబట్టారు. ఆయనకు పత్రికా సాహిత్యంపై గల అభిమానంతో 'కృష్ణాపత్రిక'ను మచిలీపట్టణంలో ప్రారంభించారు. మహాత్మాగాంధీ పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొంటూ న్యాయవాద వృత్తిని విడిచిపెట్టారు. గాంధీజీ ఆశయాలను 'తు.చ' తప్పకుండా, త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ, ప్రజల కష్టసుఖాలకు ఇతోధిక సహాయమందిస్తూ, గాంధీగారు చేబట్టిన సహాయనిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెసు అధ్యక్ష పదవుల్లాంటి పదవులు చేబట్టిననూ సామాన్య కార్యకర్తవలె నిరాడంబరంగా జీవించిన వ్యక్తి. సత్యశీలి, ధృఢ సంకల్పుడు. కాంగ్రెసు పార్టీ నిర్వహించిన తీవ్ర రాజకీయ ఉద్యమాలందు పాల్గొని, 1921, 1930, 1932, 1940 సం॥ముల్లో కారాగార శిక్షలను అనుభవించారు.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి నడుము బిగించి పోరాడిన తొలితరం వ్యక్తి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగువారికి జరుగుతున్న అన్యాయాలను గుర్తించి ఆంధ్రోద్యమానికి సారధ్యం వహించిన కార్యకర్తయే గాకుండా 1931 సం॥ బాపట్లలో జరిగిన ప్రథమ ఆంధ్ర మహాసభా కార్యనిర్వహణ బాధ్యతను కార్యదర్శిగా నిర్వహించిన వ్యక్తి కొండా వెంకటప్పయ్య. ఏ ముఖ్యపదవులూ కోరకున్ననూ అటు కాంగ్రెసులోనూ, ఇటు ప్రజల్లోనూ మంచి కార్యకర్తగా పేర్గాంచిన వ్యక్తి కొండా వెంకటప్పయ్యపంతులు. హరిజనుల దేవాలయ ప్రవేశానికి అహరహమూ కృషి చేసిన మహనీయవ్యక్తి. ఆయన నిస్వార్ధసేవనూ, నిరాడంబరతనూ, నిజాయితీని నిబద్ధతను గుర్తించిన ప్రజలే ఆయనకు 'దేశభక్త' బిరుదమునిచ్చి గౌరవించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎలా కలలుకన్నారో, ఆ కల నిజంగా ఫలించడమూ, ఏఆంధ్రరాష్ట్ర సాధనకోసం ఎంతటి కృషిచేసారో, ఆ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రావతరణమును చూడకుండానే 1948 సం॥ము ఆగస్టు15వ తేదీన కన్నుమూయడంతో ఆయన అభిమాన ప్రజానీకం అశ్రుజల నేత్రాలతో వీడ్కోలునిచ్చింది. ●

## 'పదహారు అణాల తెలుగు వాడు' మాటతో బాటు నాణెములపై ఉండే తెలుగు అక్షరమూ పోయింది!! - జేబులో డబ్బులు పోయెనే!! -




'దమ్మిడీ'కి కొరగాడు! అణా విలువ చేయదు! ఎర్రటి ఏ గాణీ జేబులో ఉండదు. పదహారణాల తెలుగువాణ్ని' అనే నానుడి మాటలు మాట్లాడే తెలుగుతనం, మాటలు ఆ నాణెములతోనే పోయాయి. దమ్మిడీ, ఏగాణి, కాని, అణా, బేడా, పావలా, అర్ధరూపాయి, ముప్పావలా, రూపాయి అనే నాణెములు పోవడంతో తెలుగు భాష మసక బారడంతోబాటు, నాణెములపై ఉన్న తెలుగు కూడా మసకబారిపోయింది. రూపాయి నాణెమున్నా రూపాయకు విలువా లేదు, నాణెముపై 'ఒక రూపాయి' అని ఉండే తెలుగు పేరు లేదు.

తెలుగు వారి గొప్పతనం వివరించడానికి భోగరాజు పట్టాభిసీతారామయ్య గారొకసారి గాంధీగారికి నాణెమూ, నోటూ చూపిస్తూ 'చూడండి! మహాత్మా! వన్ రూపీ (One Rupee) అన్నది దిగువన రెండో స్థానములో 'ఒక రూపాయి' అని ముద్రించారు. అంటూ బ్రిటీష్ ప్రభుత్వం ముద్రించిన నాణెంలో తెలుగుకిచ్చిన స్థాయిని వారిచ్చిన 'ముఖ్యత'ను తెలియచేసారు. అలాగే ఐదు, పది, వంద, వెయ్యి రూపాయల నోట్లపై కూడా రెండవ స్థానాన్ని తెలుగుకే యిచ్చారు.

'ఏగాణి' పెట్టి నేను, నిమ్మతొనలు, చెక్కరకేళీలు (పంచదారతో చేసినవి) కొనుక్కున్నేవాణ్ణి. గాకపోయినా తెలుగువారికి డబ్బుతో పని ఉండేది కాదు. పిల్లలూ, స్త్రీలూ పిడికెడు బియ్యమో, ఓ కొబ్బరి కాయనో యిచ్చి వస్తువులు కొనుక్కున్నేవారు. అవే మన తెలుగువారి క్రెడిట్ కార్డులు.

రూపాయికి నూరుపైసలు అంటారుగానీ, ఆ పైసలు ఎక్కడున్నాయ్. వాటికి విలువ ఎక్కడుంది. (అమెరికాలో అక్షణాలా ఉన్నది. ఒక డాలర్‌కు 100 పెన్నీలు, వారు 99 పెన్నీ తిరిగి యిస్తారు. అలాగే డాలర్‌పై ఒక పెన్నీ ఎక్కువున్నా ఆ పెన్నీని వసూలు చేస్తారు. మనకిక్కడ అలా కాదు. అర్థరూపాయి కొట్టువాడు తిరిగి యివ్వలసివస్తే ఒక చాక్‌లెట్ తిరిగియిస్తాడు. కరెన్సీ వాడకం వచ్చిన తరువాతనే నాణెమునకు విలువ తగ్గింది. (కొనే) సరుకు నాణ్యమూ తగ్గింది. ●

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# పరస్పర వైషమ్యాలతో ద్వారకా ద్వీపాన్ని యాదవులు సాగరంలో ముంచినట్టు ఆంధ్రప్రదేశ్ సంపద, సంస్కృతి, భాషలను రాష్ట్ర నాయకులు ముంపుకు గురిచేశారు!

సస్యశ్యామల కోమలమైన, భారతదేశానికే అన్నపూర్ణ- అన్నలక్ష్మి- ఆదిలక్ష్మిగా సిరులు కురిపించినట్టి పేరులుండేవి. ఆంధ్రదేశాన్ని మూడు సముద్రముల్లో మునకలు వేసే చిల్లు పడవగా తోసేసారు.

అంతా స్వయంకృతపాపం. అందరు రాజకీయనాయకులూ ఈ ముంపుకు భాగస్వాములే! దేశభక్తి పరులుగా, ప్రజాసేవకులుగా చెలామణియవుతూ, అవినీతిని ఆలంబనం చేసుకున్నారు. ఏ ఒక్కడి హృదయం లోనూ దైశభక్తి లేదు, త్యాగుల ఫలంతో వచ్చిన ఆంధ్రరాష్ట్రం, ముందు త్యాగులను పోగొట్టుకున్నది. పిదప మాతృ భాషను పోగొట్టుకున్నది. సంస్కృతిని, సాంప్రదాయాలను, దేశసంపదను పోగొట్టు కున్నది. కలోగంజో తాగేవాడలాగే వున్నాడు, గూడులేని వాడూ అలాగే ఉన్నాడు. పదవీ వ్యామోహం, కులప్రాంత భావాలవారు, రాజకీయపదవుల్లోకి వచ్చి అనంతమైన దేశసంపదను జేబుల్లో పెట్టుకున్నారు! దయాదాక్షిణ్యాలు లేనివాడు, ధృతుడూ, మైనార్టీ వాడంటూ ఉపన్యాసాలిస్తాడు. ఎవడు ధృతుడు ఎవడు మైనారిటీవాడని ప్రశ్నించుకుంటే సమాధానం శూన్యం. హిందువులు ధృతులు. హైందవ ధర్మం కోసం పోరాడేవారూ ఆరాటపడేవారు దళితులు. వారికి స్థానం లేదు. భారతదేశం పేరూ, భారతీయతత్వం పోయినప్పుడే ఈ దేశస్థితి దిగజారింది.

దేవుడి సొమ్ము, గో, బ్రాహ్మణ, క్షత్రియులను, గిరిజనులను పెద్దకాపులను హింసపెట్టిన వాళ్ళు, జనం నోటి కూళ్ళను తీసేసినవాడు, చదువుకునే హాస్టలు పిల్లలను పస్తులు పడుకోపెట్టినవాడు, పుట్టిన అడపిల్లను పరిమార్చేవాడు, ఒంటరిగా స్త్రీ తిరగలేని స్థితి కల్పించినవాడు, భార్య కదా యని హింసపెట్టేవాడు, గొడ్డు కదాయని బండికి కట్టి చావబాదేవాడు, ప్రజలను దోచుకునేవాడూ ఈ జన్మలోనే నరకం అనుభవించే కాలం వచ్చింది.

తండ్రి, తల్లి, గురువు, దేవుడు, పాలకులను అగౌరవించిన వాడి చావు-ఈ నేల తల్లి చేతుల్లోనే ఉంది. ఆ నేల తల్లినే తుపాకులతో తూట్లు పరుస్తున్నాడు. ఆ తల్లి కడుపులో చిచ్చుపెడుతున్నాడు. నిగ్రహం కోల్పోతే ఆ తల్లి కడుపు చింపుతుంది.

నింగీ నుంచీ నేలపై పడిన వర్షం నదుల ద్వారా కాలువలకు చేరి పంటలకూ, పాడిపశువులకూ, త్రాగునీటి సౌకర్యం కలుగకుండా సాగరం పాలవుతున్నది. అధికారులూ, సంబంధిత ప్రభుత్వమూ సిగ్గు ఎగ్గూ లేకుండా ఇన్ని వేల క్యూసెక్కుల నీటిని సాగరంలోనికి వదులుతామని చెబుతున్నారు. ఆహా! ఎంత ఔదార్యం మనది. సాగరంలోని నీరు ఆవిరయే ఆకాశంలో మబ్బులుగా మారి, వర్షం కురుస్తూ ఆహారదాహార్తులు లేకుండా కాపాడుతూంది. కానీ ఆ నీరును కాపాడులేకపోతున్నాం. వరదల, ద్వారా వచ్చిన నీరును, పంట కాలువలకు, చేనిలోని బోదులకూ చెరువులకు పారించడం లేదు. పాపిష్ఠివాళ్ళు పారనీయడం లేదు.

జనస్తంభనం చేసినట్టు ప్రతిపక్షాల ఉద్యమాలు, స్వపక్షంలోని సీనియరు నాయకుల ఉద్వేగ ప్రకటనలు రాష్ట్రమును అతలా కుతలం చేసింది. పైగా ఒకర్ని ఒకరు అణగద్రొక్కడానికి చోటామోటీలందరూ తమ గుంటల్ను, తామే తవ్వుకున్నారు. ఆ గుంటల్లో పడుతున్నారు. బంద్‌లంటూ బంతులాడేవారు గాలి తీసిన బంతుల్లా కుదించుకుపోతూ, దేశవనరులను చేజేతులా నాశనం చేస్తున్నారు.

**"ఒక్కరైనా తమ మీద ఒట్టు వేసుకుని నేను అవినీతికి పాల్పడలేదు. ప్రజల సొమ్ము తినలేదు. మాతృదేశభక్తితో మాతృభాషా, సంస్కృతి కోసమే కృషిచేస్తున్నాను" అనీ తమ తమవారిపై ప్రమాణం చేసి చెప్పగలరా? చెప్పలేరు.**


దేశ సౌరభౌమత్వానికి చిచ్చుపెట్టాలనే దౌష్ట్య ధోరణిలో ఉన్న నాయకులు తమ ఇంటికి తామే చిచ్చుపెడుతున్నామని గ్రహించాలి. ఒకప్పుడు చక్కగా ఉన్న ద్వారకలో ముసలకం పుట్టి, యాదవులందరూ ఒకరినొకరు చంపుకుని 'ద్వారక'నే సముద్రంలో ముంచేసారు. అధర్మం పెరిగి, ధర్మం నశించిననాడూ ద్వారకాద్వీపగతే మనకు కలుగుతుంది. ఎక్కడో, కోటికి ఒకడో అరో మంచివాడు ఉండడం వలన ఆ ప్రమాదం మనకు కలుగలేదు. కానీ ప్రమాదపుటంచుల్లోనే ఉన్నాం. ●

# గురజాడవారి అడుగుజాడల్లో నడుస్తున్నామా?

తగుదునమ్మా అంటూ గురజాడవారి 150 జయంతి సభలు చేయాలనుకుంటు న్నారు. ఇప్పుడున్న తెలుగువారిలో ఎంతమంది దేశాన్ని ప్రేమిస్తున్నారు? ఎవరు దేశమంటే ప్రజలని భావిస్తున్నారు? మంచిని పంచుతున్నారు?

**దేశమును ప్రేమించుమన్నా**
**మంచియన్నది పెంచుమన్నా**
**వట్టిమాటలు కట్టిపెట్టోయ్**
**ఘట్టిమేల్ తలపెట్టవోయ్,**

దేశమంటే మట్టికాదోయ్- దేశమంటే మనుషులోయ్. అని భావించేవారు ఎవరండి? దేశాన్ని ప్రేమించే వారుంటే మంచి పనులు తలపెట్టేవారు.



ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకున్నట్టు 2011లో మహోధృతంగా పుట్టిన తెలంగాణా ఉద్యమం హైదరాబాద్‌ను ఆయువు పట్టుగా చేసుకుని అతలాకుతలం చేసింది. జపాను, ఇండోనేషియాల్లో భూకంపాలు, సునామీలు అగ్ని పర్వతాల పేలుళ్ళు వచ్చినప్పుడు కూడా ఇన్ని అనర్థాలు జరగలేదు, ఇంతగా పుడమి మరుభూమి కాలేదు. ఆటంబాంబులైనా ఇంతటి మారణహోమం సృష్టించేది కాదు. భూమి తలక్రిందులైనట్టు, బొగ్గుగనుల్లో మంటలు రేగి జనాన్ని మసిచేసినట్టు, ఓ ప్రక్క జరిగితే మరో పక్క మరో కారణాలుగా రాస్తారాకోలు. విధ్వంసకలాపాలు దేశం ఎటుపోతుందా- అనే భీతీ, భయం ఈ ఒక్క ప్రాణికి కలిగింది. 'శ్రీశ్రీ' అన్నట్టు -

**అడుగుజాడ గురజాడది**
**అది భావికి బాట!**
**మనలోని వెధవాయిత్వం**
**మరిపించే పాట!** - అన్నది అక్షఱ సత్యమనిపిస్తుంది.

గురజాడ పలుకులబడి, ఆయన కీర్తనల తళుకులసడి, ఆ మహోమూర్తి మతం. ధోవతి, నల్లటి పొడవుగల కోటు, ఆ కోటుపై నీటుగా ఆకుపచ్చని రంగులో జలతారు శాలువా, శిరముపై హిమశిఖరం వెండి రంగుల నిండు తలపాగా, సుస్సులభ తెలుగు, ఇంగ్లీషు భాషా దర్పంగా ఇరుప్రక్కల మీసాలూ, ఆధునిక, సామాజిక, అభ్యుదయ, సంస్కరణ, సేవా ప్రయత్నానికా అన్నట్లు ముఖమండలమూ, పౌర్ణమి సూర్యోదయ వేకువనా, సాయం సమయాన దృశ్యమయ్యే సూర్య, చంద్ర బింబముల వంటి నేత్రాల నుంచీ దూసుకువస్తున్న దృక్కులూ, పలుచటి దవడలూ, సాహిత్యానికి సౌలభ్యం, పరమార్థం ఒనగూర్చిన ఆ ప్రజా కవిని కాకినాడలో జరిగిన ఆంధ్రసాహిత్య పరిషద్వార్షికోత్సవం దర్శించి, గురజాడ బొమ్మ గీచి చెప్పినట్లుగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి రూపు రేఖా వర్ణమును దర్పణం పట్టినట్టు చెప్పడం ఎన్నటికినీ మరిచిపోము.

సాహిత్య పరమార్థం మంచి మనసులు కల మనుష్యులను సృష్టించడమే ధ్యేయం. జాతిమతముల బంధం గొలుసును ఛేధించాలి. నిర్దేశించిన వృత్తులవారు, వృత్తిపరంగా తప్ప, ప్రవృత్తి ద్వేషాలకు లోను కారాదు.

నిజానికి తెలుగు సాహిత్యం నీతిపరంగా, భక్తి పరంగా, క్షమ, సహన, సఖ్యత, శాంతి పరంగా జనులు, జనపదములు సత్యపరమైన సన్మార్గంలో నడవాలనీ అక్షరాశ్యులు కానివారు సహితమూ నీతి ధర్మానుబద్ధంగా నడుచుకోవాలని, భారత,

భాగవత, రాయాయణ పురాణ శ్రవణంగానే గాకుండా సుస్సులభ పదాలతో, సులభగ్రాహ్యమగు నీతి శతకాలను కంఠతా పలికే శ్రవణ జ్ఞానాన్ని అందరు పలికేట్టు చేయాలి. చందోబద్ధంగా ఉన్న సాహిత్యంలో గేయపరమైన మార్పు తీసుకుని వచ్చింది కూడా తెలుగు భాషే. అందుకు ఆద్యుడు ఆధునిక యుగ ఆది కవి గురజాడ అప్పారావు గారే. గురజాడ వారి అడుగుజాడల్లో సాహిత్యం నిత్య నూతనమైన మార్గంలో పురోగమించింది. వారి తెలుగు పదసరళి ఆనాటి నుంచీ ఈనాటి వరకూ నిత్య నూతన జవ్వనిగానే ఉంటుంది. ఆ భాష జీవభాష, జరా మరణములేని జీవపదజాలత్వం ఉన్నది కనుకనే ఆయనకు ముందుతర సాహిత్యాన్ని, ఆయన వెనుక తరసాహిత్యాన్ని త్రోసి 'రాజ'నే స్థాయిలో, అన్ని స్థాయిలవారినీ అలరిస్తూన్నది. అలాటి అపూర్వ సాహిత్యాన్ని అందచేశారు. **గురజాడవారికి సమాజం గుండె, ప్రయోజనం ప్రాణవాయువు.** దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు గుత్తునాయని జాతిముత్యాల్-గుచ్చినాడే మేలిసరముల ఇత్తునాయని తెలుగు తల్లికి- ఇచ్చినాడే భక్తితో అన్నారు.

**యుగయుగంబుల నుండి మోగెడు విశ్వగాన నియత్తరంగణి-**
**భంగముల నుప్పొంగునాతని గీతశీకరముల్!** అన్నారు.

ఎక్కడ సాంఘిక దురాచారములుండవో, ఎక్కడ మంచితనం వెల్లివిరుస్తుంటుందో, ఎక్కడ వొట్టి మాటలు కట్టిపెట్టి, ఘట్టిమేలు తలపెట్టే మనుష్యులుంటారో, ఎచ్చట పాడిపంటలు పొంగిపొరలుతాయో, ఎక్కడ మనుష్యులకు పుష్టి కలిగిన తిండి దొరికీ, కండపుష్టిగల మనుష్యులుంటారో! అట్టి సముజ్వల, సమృద్ధికర, నవ్యవ్యవస్థను దర్శించాలని, తన భావుకతలందు దర్శించిన ఆది అభ్యుదయకవి, అందమైన, ఆనందమైన, ఆధునిక యుగాన్ని కన్న కవి గురజాడ అప్పారావు మహాకవి. అందుకే ఆయన పదంలో ప్రసన్నత ఉంది!

**మంచి చెడ్డలు మనుజులందున యెంచి చూడగ, రెండు కులములు**
**మంచి యన్నది మాలయైతే- మాలనే అగుదున్-** అన్నారు గురజాడ.

రాయవరం గ్రామంలో మాతామహులింట 1862 సెప్టెంబర్ 21న జన్మించిన యీ మహాకవి 1915 సం॥ము నవంబర్ 30న మనసంతా జనానికప్పగించి, **పట్టమేలే రాజుపోయెను, మట్టి కలిసెను కోట పేటలు పదం పద్యం పట్టి నిలచెను** అంట వాక్యానుసారం మనుజప్రపంచం నుంచీ వెళ్ళిపోయినా- **దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్** అన్న పదం జనపదంలో జీవిస్తూనే ఉంది. ●

స్వాతంత్ర్యానికి పరమార్థం స్వపరిపాలనం చేసుకోవడమొక్కటే కాదు. భావసామరస్యం లేకుండా దేశ సంక్షేమ దృష్టి లేకుండా దేశాన్ని అభివృద్ధి పరచుకోలేము. దేశమంటే ఒక్క మనుష్యులే కాదు, మనుష్యులకుపకారం చేస్తున్న జీవరాశులున్నాయ్. భారతదేశం పంచమాతల్లా ప్రేమించే గోవు ఉన్నది. గో క్షీరమిచ్చి శిశువులను ఆరోగ్యంగా ఎదిగేట్టు కాపాడుతున్నది. తల్లిపాలులేని వాళ్ళు గోవుపాలతోనే శిశువు ఎదుగగలుగుతున్నది. గోమయం పంటలకెరువుగా ఏపుగా వరి, గోధుమ, జొన్న వగైరా పంటలను సమృద్ధిగా పండుటకు సహకరిస్తుంది. గోమూత్రం కొన్ని వ్యాధుల నివారణకు దోహదమవుతుంది. ఆ గోవుకు మనం ఏంవి పెడుతున్నాం? అది పండించిన ధాన్యములను మనం ఆహారంగా చేసుకుని, ఏరివేసిన గడ్డిని దానికి ఆహారంగా పెడుతున్నాం. అందుకే గోవును గోమాతగా పూజిస్తున్నాం. అయితే అది వట్టిపోయి పాలునివ్వనపుడు కబేళాలకు పంపి, కిరాతకంగా చంపి మాంసం అమ్ముకుంటున్నాం. ప్రతీ పశువూ పొలంలో పంటలు పండుటకు అనితరమైన సేవచేస్తున్నాయ్. అదే విధంగా పక్షులు, కీటకాలు కూడా సేవచేస్తున్నా, వాటినీ చంపుకు తింటున్నాం. పలు వృక్షాలూ ఫలాలు యిస్తున్నాయ్, పుష్పాలు నిస్తున్నాయి. బ్రతికున్న మనిషి విడిచే బొగ్గు వాయువును, తాము స్వీకరించి, ప్రాణవాయువును ప్రదానం చేస్తున్నాయ్. చెట్లు వాతావరణ కాలుష్యాన్ని బాపడమే గాకుండా, గాలుల్ను వీచి, వర్షా ధారలతో ప్రకృతిని చల్లబరుస్తున్నాయ్. పంటలు పండడానికే గాకుండా, మనిషి, పశు, పక్షి, వృక్షాదుల దాహార్తిని తీరుస్తున్నాయ్. ప్రతిఫలంగా మనం వాటిని గొడ్డళ్ళతో నరికి, నేలమట్టం చేస్తున్నాం. రియల్ ఎస్టేట్ వ్యాపారం వచ్చిన తరువాత చెట్లన్నీ నరకబడుతున్నాయ్. పంటపొలాలను ఆవాసాలుగా మార్చేస్తున్నారు. ఆకాశ హర్మ్యాల స్థాయికి భవనాలు పెరిగి పోయాయి. ఫ్లాట్స్ కాపురాలు వచ్చాయ్. నీటివసతుల కోసం, పాతాళమునంటేట్టు బోరులు వేసారు. దీనితో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయ్. అడవుల్ని నరకడం వలన వర్షపాతం తగ్గిపోయింది. ఫ్లాటల్లోని నివాసం కారణంగా కుటుంబీకులకు సూర్యచంద్రకిరణ స్పర్శతగ్గిపోయింది. కిటికీలున్నప్పటికినీ గాలిరాదు. వెలుతురుండదు. కృత్రిమ వెల్తురు, కృత్రిమ గాలీ, కలుషిత నీరు. పురుగుల మందుతో పండిన కాయ గూరలు తింటూ ఆ బాలవృద్ధులు రోగాలపాలవుతున్నారు.



## మలేషియా తెలుగు సోదరా!
## మలేషియా రాజు
## డా॥అచ్చయ్‌కుమార్ రావు ను
## దత్తో బిరుదు ప్రదానం చేయడం
## ప్రపంచ తెలుగులకు గర్వకారణం!

ప్రపంచంలో ఏ తెలుగువారూ, తెలుగు భాషా భ్యాస భాషారాధన, బోధన-చేస్తారో వారే తెలుగువారు. తెలుగువారితో తెలుగులోనే మాట్లాడడం. తెలుగు వేష, కట్టుబాటు సాంప్రదాయాలను పాటిస్తారో వారే నిజమైన తెలుగు బిడ్డలు. అలాంటివారిలో మలేషియా తెలుగువారే ఎక్కువగా చేస్తున్నారు. అందుకు వారిని మనసారా అభినందిస్తున్నారు. **- గోటేటి**

**గౌరవనీయులైన ప్రముఖాంధ్ర మాసపత్రిక సంపాదకులకు**
**వందనముతో వ్రాయు లేఖ!**

మలేషియా తెలుగు సంఘ చరిత్రలో ఇంతవరకు కనివిని ఎరుగని ఒక మహా మేలు రత్నం మలేషియా తెలుగు సంఘ అధ్యక్షులు గౌరవనీయులైన డత్ డాక్టరు అచ్చయ్యకుమారరావుగారు. వారు తెలుగు సంఘానికి చేసిన సేవలు అపారం. ఆయన యొక్క పట్టుదల ఇంకా ఎన్నెన్నో ఘనకార్యాలు తెలుగు సంఘానికి చేసినందువలన 2-6-2012న మలేషియా ప్రభుత్వం ద్వారా గౌరవనీయులైన రారాజు. (లిగోంగ్) గారి చేతుల మీదుగా **డత్తోన్న** గౌరవ బిరుదు డాక్టరు అచ్చయ్య కుమారరావు గారికిచ్చి సన్మానించినందువలన మలేషియా తెలుగు సంఘ సమూహము చాలా గర్వపడుచున్నాం.

ఎందరో మహానుభావులు మలేషియా తెలుగు సంఘాన్ని పరిపాలించారు. అయినప్పటికిన్ని మన తెలుగు సమూహానికి ఇంతవరకు ఏ యొక్క గుర్తింపుగానీ, బిరుదుగాని సన్మానాలుగాని లభించలేదు. కాబట్టి ఈ నూతన యుగంలో ప్రవేశించిన ఈ మహానుభావుడు డత్తో డాక్టరు అచ్చయ్య కుమార్‌రావు గౌరవనీయులైన తెలుగు భాషాభిమాని **శ్రీ గోటేటి శ్రీ రామారావుగార్కి వందనములతో వ్రాయులేఖ! మీరు ఎల్లప్పుడు ఆయురారోగ్యములతో సుఖసంతోషములతో తులతూగుతూ తెలుగుభాషకు ఎనలేని సేవలు చేస్తూ వస్తారని మేము ఎల్లప్పుడు ఎదురుచూసుకొంటూనే యుంటాము. ఇక సెలవు.**

మీ భాషాభిమాని **పొలమరశెట్టి సుబ్రహ్మణ్యం,** రవాంగ్

కుమారరావుగారు ఎన్నెన్నో శ్రమలు పడి, రాత్రిపగలు అనకుండా తెలుగు సమూహాన్ని ముందుకు తీసుకురావడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. చేసుకొనే వస్తున్నారు. అందుగురించే ఈ **రత్నం** అన్న **డత్తో** బిరుదు తెలుగు సంఘాన్ని అనుసరించి మలేషియా తెలుగువారంతా గర్వపడేటట్లు డత్తో డాక్టర్ అచ్చయ్య కుమారరావుగార్కి ఇవ్వడమైనది. అందుగురించి మలేషియా ప్రభుత్వానికి మన మలేషియా తెలుగు సంఘ సమూహము ధన్యవాదములతో సహా కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నది.

**జై తెలుగుతల్లి**
మీ విశ్వసనీయమైన
**పొలమరశెట్టి సుబ్రహ్మణ్యం,** రవాంగ్

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**

# ధర్మంగాడి తప్పిందంటూ దిగులు పడుతున్న నా తెలుగు నేల తల్లి!

## - ముఖ్యమంత్రి కిరణ్ మాత్రం ఏం చేస్తారు? -

తెలంగాణా జాతీయకవి, ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవీ, **నా తెలంగాణా కోటి రతనాల వీణ** అని గళమెత్తి కీర్తించిన కవి దాశరధి కృష్ణమాచార్య

**జనం మనం- మనం జనం!**

జనం లేక మనం లేము! – అంటూ తనకు తానుగా జనంలో అందరితో కలిసికట్టుగా ఆనందంగా బ్రతికారు. ఆయన కలుపుగోలు తనపు ఆనందాన్ని తనివితీరా ఆస్వాదించకలిగాను నేను.

ఆధునిక యుగానికి ఆదికవి సమాజ సేవకుడూ, సమాజం అడుగుల్లోనే అడుగు కలిపి, అట్టడుగున తెట్టుగా ఉన్న కుళ్ళు సాంప్రదాయాన్నంత తుడిచి, తూర్పార పెట్టిన గురజాడ అప్పారావు అడుగుజాడల దారినే అడుగులు వేసిన అభ్యుదయ భావాల సాహితీ కర్త, సంస్కరణాభిలాషి. **జాతి అంతా శ్రమిస్తేనే- సాహసంతో చర్చిస్తేనే దరిద్రాన్ని రూపుమాపి- చరిత్రను సృష్టించగలం అన్నారు. నేను శ్రామిక జనార్దుణ్ని- కార్మిక వ్యతిరేకుల కాళీయ మర్దనుణ్ణి. నేను సామాన్య ప్రపంచ పౌరుణ్ణి- అయినా నేను అసమాన్య ప్రజావీరుణ్ణి!-** అంటారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంచే 'కళాప్రపూర్ణ' నాగార్జున విశ్వవిద్యాలయం వారిచే డాక్టర్ ఆఫ్ లిటరేచర్ వంటి ఆంధ్రా తెలంగాణా రాయలసీమ పొరుపచ్చాలు లేకుండా అందుకున్నారు.

ఇప్పుడా పొత్తు, సంపత్తులను కాలరాసే కవులూ, రాజకీయ పక్షాలూ, విద్యార్థులు, విద్యాబోధకులు, విద్యాసంస్థలు, బొగ్గు ఉత్పత్తి సంస్థలు, నిత్యావసర సంస్థలూ ఎన్నడూలేని విధంగా మండలం రోజులకు మించే బంద్‌లు చేసి, సహాయ నిరాకరణచేసి, బస్సులూ, రైళ్ళనూ, ఇతరరవాణా సాధనాలను ధ్వంసం చేసి, రోడ్డుకు అడ్డంగా పడుకుని నానా దుర్భిక్షకర పరిస్థితులను కల్పిస్తే, రాజకీయ నాయకులు ప్రేక్షకులై చూసారు. విద్యుత్పాదక కేంద్రాల వారు విధులకు వెళ్ళలేదు. బస్సులతో పాటు ఎలెక్ట్రిక్ ట్రాన్సుఫార్మర్లను దహనం చేసారు. పరిపాలనం సాగనీయలేదు. ఒక్కొక్క పరిశ్రమే కడగండ్లపాలయి, కొన్ని మూసేసినా. కొందరు వలస పోయారు. కొందరు శాల్యూట్ హైదరాబాద్, ఆంధ్రాకు రాము రామ్ రామ్ అన్నారు. ఇలాటి ధృతరాష్ట్రులవంటి నాయకులు, పొజిషన్, అపొజిషన్‌లో ఉంటూ సహాయ నిరాకరణమే గాకుండా సంహార దృష్టితో పాలనను స్థంభింపచేస్తే, వనరులెక్క డుంటాయ్, విద్యుచ్ఛక్తి ఎక్కడ ఉంటుంది. ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ ఏ విధంగా ఎలా పాలన చేయగలరు?

అందుకే దాశరధి: **జాతి అంతా శ్రమిస్తేనే – సాహసంతో చర్చిస్తేనే**
**దరిద్రాన్ని రూపుమాపి చరిత్రను సృష్టించగలం**–ఏనాడో అన్నారు.
**విఘ్నేశ్వరుని పెళ్ళికి వెయ్యి విఘ్నాలు!**
**వెర్రోడి పెళ్ళికి వేయి వేదింపులు!!**

–ఇలాటి ఇకిలింపులూ, సకిలింపులతో –ఆంధ్రాభాషా రాష్ట్రం ఏర్పడింది!!

ముమ్మందుగా అక్టోబర్ మొదటివ తేదీన ఏ భవనములూ, ఏ భవంతులూ సౌధాలూ, నీటి వసతులు లేని కర్నూలులో రాజధాని ఏర్పాటు చేసారు. త్యాగీ, కురువృద్ధుడూ యైన ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గారిని ముఖ్యమంత్రిగా చేసారు. పట్టుమని సంవత్సరమైనా ఆ మంత్రి వర్గంమననీయలేదు. అప్పుడు నేను మద్రాసు లోనే ఉన్నాను. అప్పుడే ఆయన చిరుగు జేబుల చొక్కాతో ఉన్నారు.

అటు తరువాత భారతదేశ ఉపప్రధాని కంచుమనిషియైన వల్లబాయ్ పటేల్ నెహ్రూకు తెలియకుండా రాత్రికి రాత్రి నైజాముకు సైన్యాలను పంపి, నైజాము నవాబును దారిలో తెచ్చుకుని, ఇండియన్ యూనియన్‌లో కలుపుకుందామనుకున్న సమయం వచ్చింది. 1956 మార్చిలో ప్రధాని జవహర్లాల్ నెహ్రు భారత్ సేవక్ సమాజ మహాసభను ప్రారంభించడానికి నిజమాబాద్ వచ్చారు. ఆయనకెపుడూ



ఆంధ్రనాయకులపై వ్యంగ్యాస్త్రాలు వేయడమే అలవాటు. నిజానికి ఆంధ్రరాష్ట్రం ఏర్పడడం సుతారామూ నెహ్రుకు ఇష్టం లేదు. పొట్టి శ్రీరాములుగారి ప్రాణాహుతి కారణంగా పుట్టిన వేడికి కాంగ్రెసు అధిష్టానం తట్టుకోలేక 'ఊ' అని ఉలికిపడేట్టు కర్నూలు రాజధాని పెట్టుకోండి. గుంటూరులో హైకోర్టు పెట్టుకోండి అంటూ భిక్షావందనం చేసారు. అక్టోబర్1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

తెలంగాణా విముక్తి పొందిన తరువాత విశాలాంధ్రగా విస్తృత పరిచి అందులో కలుపుదామంటూ ఆంధ్ర తెలంగాణా ఉభయనాయకులూ సమ్మతమన్నారు.



**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి**
**చేయని తప్పులకు నిందలపాలవుతున్నాడు. రాష్ట్ర దివాళాతనానికి బాధ్యుడు కాదు, సమ్మెలూ, బంద్‌లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసాయ్.**

హైదరాబాదు రాజధానిగా (నవాబుల భవనాలున్నాయ్ కాబట్టి) రాజధానీ నగరం చేసుకోండి తథాస్తు అంటూ బోడితలకు జుట్టు మీరే వెతుక్కోండి, అతుక్కోండి అన్నారు. పాపం మన తెలుగు నాయకులు దాస్యభావకులుగా రెండు వందల సంవత్సరాల అనుభవం ఉంది కాబట్టి తథాస్తు అంటే తథాస్తు అన్నారు.

1956 మార్చిలో భారతప్రధాని నెహ్రూ నిజామాబాద్‌లో భారతసేవక సమాజసభలను ప్రారంభిస్తూ వచ్చారు. ప్రసంగం చేస్తూ తన సహజ వ్యంగ్య ధోరణిలో కడుపులో ఉలుకును సామ్యపలుకుగా

**ఏక్ మసూమ్ బచ్చీకి ఏక్, నట్‌ఖట్ కె సాద్ షాదీ హోరహీహై**
**కయీదిన్‌కే బాద్‌మే ఇత్తె ఫాక్‌నహీం**
**హోనేకే తలాక్‌దే సకేత్‌హై**


– అన్నారు అంటే అమాయకపు అమ్మాయికి గడసరి అబ్బాయితో పెళ్ళి అవుతున్నాది. కొన్నాళ్ళ తరువాత కాపురం పొసగక పోతే విడాకులు ఇచ్చెయ్యవచ్చు అని దాని అర్థం.

నెహ్రూ ఏ ముహూర్తంలో నోటి మాట ఏ సందర్భంలో అన్నారో గానీ, వెనుక తథాస్తు దేవతలు ఉన్నారు అనుకుంటాను. వాళ్ళు తథాస్తు అన్నారు. అదే నిజమైంది– ఆగి ఆగి వస్తూన్న మూర్ఛ (ఫిట్సు) లా విడిపోతామనే ఉద్యమాలు వస్తున్నాయ్. ఒక సమయంలో ఉప్పెనలా, ఒక సమయంతో తుఫానులా మరొకసారి సునామీలా వస్తున్నది.

కాసు బ్రహ్మానందరెడ్డి, జలగం వెంగళరావుగారు ఉత్తములూ ఉద్దండులూ, ఉద్యమం ఉధృతంగాకుండా అణగారుస్తూ వచ్చారు. రాజశేఖరరెడ్డియైతే చెవినే పెట్టలేదు. అభివృద్ధి మంత్రంతో కాలక్షేపం చేసేవాడు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడే సమయంలో మంచు కొండల అండలు విరిగినట్లు, ఆంధ్రులుండే వాసస్థలాన్ని, నీటివాలు, పంటపోటు కల గ్రామాల్ని ఓ ప్రక్క తమిళనాడు, మరోప్రక్క కర్ణాటక, ఇంకో ప్రక్క ఒరిస్సా– ఎవరికి చిక్కిన ప్రదేశాలను వారు మింగేశారు. గాంధీగారి వియ్యంకునిగా విశేషాధిక్యత గల రాజాజీగారు మద్రాసు లాక్కుంటూ, తిరుపతికి కూడా ఎసరు పెడదామనుకున్నారు. కానీ తిరుత్తణి తీసుకుంటూ సరిపెట్టుకున్నారు. తెలుగువారు ఎక్కువగా ఉన్న హోసూరు, కృష్ణగిరి ప్రాంతాలు తమిళనాడుకే వెళ్ళాయ్. బళ్ళారి కర్నాటకకు వెళ్ళింది. బళ్ళారి కర్నాటకకు వెళ్ళింది.

తెలుగు భాష (త్రిలిఙ్గ భాష, ఆంధ్రభాష) చరిత్ర నిన్న మొన్నటి కాదు. వేల సంవత్సరముల ఘన చరిత్ర ఉన్నది. భారతదేశంలోని మూలవాసుల చరిత్రలో తెలుగుజాతి ప్రస్తావన ఉన్నది. ఆంగ్ల భాషా పారవశ్యంలో పడి మన భాషను మనమే నిందించుకోవడం నిర్లక్ష్యం చేయడంలో ఏం న్యాయం ఉన్నది. ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన ఈ 58 సంవత్సరాల్లోనూ భాషా పరంగా కృషి చేసామా? గ్రామీణా వృత్తులకు చేయూతనిచ్చామా? లేదు, లేదు అనే సమాధానమే వస్తుంది.ఆంగ్లభాష కొండ చిలువ వంటిది. ప్రపంచంలోని ఎన్నో భాషలను మ్రింగివేసింది. సాంప్రదాయ సాహిత్యాన్ని కబళించింది. పండితుల్ని క్రయం చేసింది.




## పోరాడి ఆంధ్ర రాష్ట్రం సాధించిన ఫలితమేముంది?

మాతృభాషకు అగ్రస్థానం యిచ్చామా? మాతృభాషలో పాలనం సాగిస్తున్నామా? మాతృభాషలో అధ్యయనం చేసేవారమున్నామా? ఏఁవి సాధించామని గర్వపడాలి? ఎవరిని గర్హించాలి!

**ఏఁవి తల్లీ, నిరుడు కురిసిన హిమసమూహములేఁవి తల్లి**
**సార్వభౌముడు కృష్ణరాయలెక్కడ తాండ్రపాపారాయుని పౌరుషమెక్కడ**
**ఎక్కడమ్మా తెలుగుతల్లీ ఇన్నినాళ్లూ ఎక్కడుంటివి?**
**మూడు కోట్ల ఆంధ్రులున్నపుడే తెలుగు విరిసెను వెలుగు మురిసెను–**

పురాణ సాహిత్యాన్ని తారుమారు చేసింది. ఈ దేశవాసుల్ని ఈ దేశవాసులు కాదన్నది. స్వాతంత్ర సంగ్రామంలో కలిసి పోరాడిన హిందూ ముస్లిముల మధ్య చిచ్చుపెట్టింది. దోచుకోవడం నేర్పింది. దాచుకోవడం నేర్పింది. దేశసంపదలను దారి మళ్ళించింది. ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతారన్నట్టు దేశమును ప్రేమించే నాయకులు లేరు. దేశీయ పరిశ్రమలు లేవు. చేతివృత్తులు వారి చేతుల్ని కాల్చేసారు.

చివరికి ప్రకాశం పంతులులా ఉన్న స్వార్జిత ఆస్తుల్ని దేశం కోసం ఖర్చుపెట్టిన నాయకులు లేరు. ఓ అల్లూరి సీతారామరాజులా ఆత్మస్థైర్యంతో వలస శక్తులను పోరాడే వాడొక్కడు లేడు. బందలంటూ, రాస్తారాకోలంటూ దేశసంపదను నాశనం చేసేవారు మన స్థిరచరాస్తుల నెలా తగులపెడుతున్నారో మన కళ్ళముందు జరిగిన ఉద్యమాలే సాక్ష్యం. పరమాందయ్య శిష్యుల్లో గురువుగారి పాదాలను మ్రొక్కుతూ నా కాలును నేను చంపేస్తాను, నీ కాలును నువ్వు చంపుకో అన్నట్టుంది ఆంధ్రదేశ పరిస్థితి. ●




## జీతం అనుకోకపోతే పారితోషికం!

ఇంట్లో వంట చేసిపెట్టినందుకు భార్యకు నెలకు ఇంతని యిస్తే బాగుంటుంది. ఈ మాట అన్నది ఎవరో కాదు! కేంద్రంలోని ఓ సహాయమంత్రి. వండి వడ్డించే భార్యకు విలువ కట్టి జీతం యివ్వడం స్త్రీని గౌరవించడమా?

పెద్ద మనసుతో ఆయన ఇంకో మాట కూడా అంటూ వంట చేసే వాడు భర్త అయితే అతనికీ పారితోషికం ఇవ్వవచ్చునట!



## ఆంధ్రులు అతిరథులయ్యుండీ! అసూయ అంతఃకలహములతో నామరూప రహితులగుచున్నారు!

**- కులతత్వము వెన్నదనుగన్న వెధవ గుణం! -**

అనిరి యేనాడో తెలుగులెంక

**శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి**



శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి

**తుమ్మలపల్లి సీతారామచౌదరి గారిది గుంటూరు మండలం. ఉభయ భాషాప్రవీణులు. మాతృభాష తెలుగు, మహాత్మాగాంధీ ఆయనకు ఎడతెగని అభిమానం. ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేసి విశ్రాంతి పొందిరి. ధర్మజ్యోతి, రాష్ట్రగానము పరిగపంట, శబల మున్నగు కావ్యములు రచించిరి. మహాత్మాగాంధీపై తనకున్న అభిమానంతో గాంధీగారి ఆత్మకథను తెలుగు పద్యములతో తీర్చిదిద్దారు. అసలు సిసలు గాంధేయులు.**

ఏ పుణ్య లేశమ్ము నా పాలిదయ్యెనో - నా పూజకే లోకనాథుడు పొంగెనో నీ పావనోదం శ్రీ పరంపరలో - నీపదార్చకులలో నేనొక్కడ నైతి తెలుగు తల్లీ! - అని తెలుగు భాషలో తరించిపోయిన తెలుగు కవి తుమ్మల సీతారామమూర్తిచౌదరి

అతిరథులే కదా తెలుగువారందరు! అయిననూ నామరూపములు లేకుండా పోతున్నారంటే, వారిలోని అంతఃకలహములూ, అసూయనలే కారణమని నా నిశ్చితాభిప్రాయం. మరొక కారణం కులతత్వం వెన్నుదన్నై తన్నుచున్నది అని ఏనాడో చెప్పారు.

అరవుల గూడకట్టు, అరబ్బుల లుంగీ పొత్తులు, గుజరాతీ గుడ్డ టోపీ నెయ్యపు వేషధోరణిని ఆయన నిరసించాడు. కొదమ తుమ్మెద రెక్కలతోడ, ముఖమునకొక వింత కాంతి నిచ్చెడు మీసములను గొఱిగించి, ఫ్రెంచి పోలికయట - ముక్కు క్రింద లేశము నిలిపెదరు ఫ్రెంచి విలాసమట. ఇలా కొంకిరి వేసములు వలచి మనవారు కోతులైరి. ఎవ్వరీ సంకరులంచు లోకమున ఎకసక్కముల పాలగుదురు అని వాపోయా అన్నారాయన.

ఆయన ఎవరో కాదు తెలుగుకు ప్రాణమిస్తూ స్వతంత్ర భావజాలమైన ఆత్మగౌరవము నెరిగింపచేసిన శ్రీ తుమ్మల సీతారామమూర్తి. తెలుగులెంక రాష్ట్రగానము రచించిన ప్రాతఃస్మరణీయులు శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారు. మన మాతృభాష గిట్టదా? మన తాతతండ్రులు కిట్టరా? మన కట్టూ, సంప్రదాయములు గిట్టవా? పసగల యవ్వనమంతయూ పరభాషలకు అంకితమవుతారా? వలదు వలదు. ఆంధ్రులందరూ తెలుగులోనే సంభాషించాలి, తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరములు వ్రాయాలి. పరప్రదేశములూ పరరాష్ట్రములలో ఉన్న తెలుగువారు మాతృభాషను మరిచిపోతున్నారని ఆవేదనపడుతూ - **ఆంధ్రుడవై జన్మించితివి. ఆంధ్రుడవై అనుభవింపు ఆయుర్విభవంబు ఆంధ్రుడవై మరణించుము.** ఆంధ్రత్వము లేని బ్రతుకును ఆశింపకుము. జన్మజన్మలకు తెలుగువానిగానే పుట్టాలని శ్రీ తుమ్మలవారు తెలుగుతల్లిని **'నీ అనుంగు బిడ్డగా, నెపుడున్, జనింపగన్ వీనకి పెట్టుము భిక్ష'** అంటూ తెలుగు తల్లిని వేడుకున్న పదహారణాల తెలుగు బిడ్డ శ్రీ తుమ్మల సీతారామమూర్తి.

లేజవరాలి మోవికి జిలేబికి, బాలరసాల శ్రీమాద్ధవికి శ్రీ జనయిత్రికి, రుచులు చిందెడు తేనెగల ఆంధ్రవాణికి తెలుగు బిడ్డలే విరోధులు - అని నొచ్చుకున్నారు. తెల్లవాని భాషపై తెలుగువానికి మోజట. ఇద్దరు తెలుగువారు తమ ఇంటి చెప్పుకోనద్దిర మాతృభాష గదా ఇంగిలీషున వాగుచుండ్రు ఇది పెద్ద రోగము. తెలుగు భాష మిగిలిన అన్ని భాషలకన్న తియ్యనైనిదనే నగ్నసత్యాన్ని తెలుగువాడు మినహా పరదేశీయులందరూ గుర్తించారు. తెలుగు భాష నిగ్గుజగ్గులను జూచి ఆంగ్లేయుడైన బ్రౌను మహాశయుడు బ్రహ్మరథము పట్టారు. తెలుగు భాష ఠీవీ పరించి మహమ్మదీయ ప్రభువు ఇబ్రహాం అమూల్య కానుకలు సమర్పించాడు. తెలుగు భాషయె యురపు ఎరింగి, తంజావూరును పాలించిన మహారాష్ట్ర 'శాహాజీ' ఆంధ్రవాణికి పరిచర్యలు చేశాడు. తెలుగు భాష పాట, తేట, నీటు గ్రహించి తమిళులు తమ తంజావూరు ప్రాంతీయుడైన సంగీత విద్వాంసుడు త్యాగరాజు కృతుల ప్రాధాన్యతకు తెలుగు మురిసి ఆంధ్ర భాషకు దాసులయ్యారట. జర్మనీవారు ఆయుధ సంపత్వర్ధిల్లడానికి రాజమండ్రిలోని తెలుగు శాస్త్రజ్ఞుడను తీసుకొని వెళ్ళి హిట్లరు కాలంలోనే రాజపూజ్యముల్చేసి ఇప్పటికినీ ఆయన ఫోటోకు అర్ఘ్యపాద్యములిస్తున్నారు. మరి తెలుగువారికే రోగం, తెలుగు తల్లిని మరిచి ఏ భోగం పొందుతున్నారు. ●

*Compliments from*
# Sri Krishna Bhat
***When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala***
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



## పండ్రెండవ అధ్యాయము - భక్తి యోగము

82

కాబట్టి సాధకులు మొట్టమొదటనే అవ్యక్త (నిరాకార, నిర్గుణ) మార్గమునకై పరువిడక, దేహాభిమానమను దోషమును భగవదు పాసన, నిష్కామకర్మాద్యనుష్ఠానముల వలన తొలగించు కొని, ఇంద్రియనిగ్రహమును అభ్యసించి క్రమముగ నిర్గుణ పరబ్రహ్మమందు చిత్తమును ప్రవేశింపజేసినచో అత్తఱి ఏ ప్రయాసలేకయే దైవప్రాప్తిరూప లక్ష్యము సిద్ధించగలదు. పరమార్థరంగమున ప్రవేశించి సాధకులనేకులు బ్రహ్మమును గూర్చి ఉపాసనాదుల సలుపుచున్నను ఉత్తమ ఫలితములను బొందజాలకపోవుటకు కారణ మీ శ్లోకమున చక్కగ తెలుపబడినది. క్షేత్రమును శుద్ధపఱచక విత్తనము వేసినచో ఏమి లాభము? పునాది గట్టిగా లేక మేడ కట్టినచో నిలుచునా? అట్లే హృదయమందలి దేహాభిమానము మున్నగునవి తొలగనిచో బ్రహ్మమందు మనస్సు నిలవదు. సాధకులీ విషయమును బాగుగ జ్ఞప్తియందుంచుకొనవలెను. వాస్తవముగ ధ్యానముగాని, ఉపాసనగాని ఎంతయో ఆనందరకమైన పరిస్థితి. అది సచ్చిదానంద సాగరమును గూర్చిన విషయము కదా! అందు కష్టమెందులకుండును? అది ప్రయాసను పోగొట్టునదేకాని, కలుగజేయునది కాదు. కాని జనులు దానిని ఆచరించు పద్ధతిని తెలుసుకొనజాలక దేహాభిమానవశమున కష్టమనుభవించుచున్నారు. కావున సుగుణోపాసనమున కొంతకాలము మెలిగి, దేహాభిమానమును పోగొట్టుకొని తదుపరి నిర్గుణోపాసన నవలంబించుట ఉత్తమోత్తమము.

**6. యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే.**

**7. తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్**
**భవామి న చిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్.**

**వ్యాఖ్య :** ఇందు మొదటి శ్లోకమున సాధకుడు అనుసరించవలసిన పద్ధతిని, రెండవ శ్లోకమున దానియొక్క అఖండ ఫలితమును భగవానుడు తెలియజేసిరి. ఆ పద్ధతి యేదియనిన (1) సమస్త కర్మములను భగవంతునకు సమర్పించుట (2) వారినే పరమ గతిగ నెన్నుకొనుట, లేక వారియందే చిత్తమును నెలకొల్పుట (3) అనన్యభావముతో (ఏకాంత భక్తితో) అట్టి పరమాత్మను ధ్యానించుట – ఈ ప్రకారము భక్తితో తన్నుపాసించువారలను సర్వేశ్వరుడు జననమరణ రూపమగు ఈ సంసార సాగరము నుండి లెస్సగ ఉద్ధరించెదరని పలుకుచున్నారు. ఓహో! ఎట్టి మహత్తర ఫలితము భగవదుపాసకులను లభించుచున్నది! భయంకరమై, మరణరూపమైనట్టి ఈ సంసారసముద్రమున మునిగితేలుచు, నానా యాతనలను బొందుచున్న ఈ జనానీకమున కిట్టి వాక్యము లెంతటి ఆశ్వాసమును గలుగజేయగలవు! అనాది కాలము నుండి సంసారరూపమగు ఈ ఘోరవిపత్తునందు తగుల్కొని బద్ధుడై 'పునరపి జననం, పునరపి మరణం' అనునట్లు కాలచక్రమున పరిభ్రమించుచు అల్లాడిపోవు చున్న జీవునకు భగవత్ప్రోక్తములగు ఈ వాక్యములు సంజీవివంటివేయగును. మునుగుచున్నవానికి నావ యెట్టిదో సంసార దుఃఖబాధితునకు భగవంతుడట్టివారు. ఎంత గొప్పసముద్రమైనను ఒక చిన్ననావచే దాటబడునట్లు భక్తియను తెప్పచే సంసార సముద్రమును దాటవచ్చును. మిమ్ములను 'తప్పక లేవనెత్తెదను' (సముద్ధర్తా) అని భగవానుడు కరుణతో పలుకుచున్నాడు. అయితే ఎవరు హస్తమును పైకి జూచి వారి అనుగ్రహమును వాంఛించుదురో అట్టివారినే లేవనెత్తుదురుగాని తక్కిన వారిని కాదు. ఎవరు వారిని గూర్చి చింతింపరో, ధ్యానింపరో, అట్టి వారి యుద్ధరణమును గూర్చి వారు పట్టించుకొనరు. వారీదుఃఖసాగరమున ఇంకెంతయో కాలము తిరుగాడవలసి వచ్చును. జీవుడు తాను చేయవలసినదానిని చేసినచో భగవంతుడు తాను గావించవలసిన సముద్ధరణమును తాను గావించును. కాబట్టి విజ్ఞుడగువాడు తాను అనుభవించుచున్న సంసారసాగర నిమజ్జన రూప ఘోరవిపత్తును గుర్తెఱిగి మరణాదిబాధలను సంపూర్ణముగ తొలగించుకొనుటకై భగవానుని వెంటనే భక్తిపూర్వకముగ సేవించవలెను. భవరోగవినాశనమున కిదియే సముచిత భేషజము.

యేతు – అని చెప్పినందువలన ఎవరైనను సరియే (జాతి మత కుల భేదము లేక) భగవంతు నాశ్రయించి తరింపవచ్చునని స్పష్టమగుచున్నది.

'సర్వాణి కర్మాణి' అనుటచే ఏవియో కొన్ని కర్మలను సమర్పించుట కాదనియు, తాను జేయు సమస్త కర్మలను ఈశ్వరార్పణము గావింపవలయునని భావము.

అనన్యేనైవ యోగేన – ఇంతవఱకు కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము మున్నగు అనేక యోగములను చెప్పి చెప్పి ఇప్పుడొక క్రొత్త యోగమును భగవానుడు లేవదీసెను. అదియే అనన్యయోగము. ఇది ప్రత్యేకమగు ఒక యోగము కాకున్నను అన్ని యోగములతో ఇది చేరిననే అవి రాణించును. ఏ యోగమైనను అనన్యచిత్తముతో నాచరించినచో మాత్రమేఫలవంతమగును. ఇతరములగు ప్రాపంచిక చింతనలు, దృశ్యసంకల్పములు మనస్సునకు రానీయక కేవలము పరమాత్మ వస్తువొక్క దానినే చింతించుచుండవలెనని దాని భావము.

'మాం ధ్యాయన్త ఉపాసతే' – 'మాముపాసతే' అని చెప్పక ధ్యాయన్తః' అని కూడ దానికి చేర్చుటవలన సామాన్యమగు ఉపాసనకంటె అర్థభావనతో గావింపబడు ఉపాసనయే శ్రేష్ఠతమమని, అదియే అవలంబనీయమని బోధించినట్లైనది. మంత్రజపము చేయునప్పుడు మంత్రోచ్చారణతో బాటు మంత్రార్థమును గూడ నెట్లు భావించవలెనో, అట్లే భగవంతుని ఉపాసించునపుడును వారి స్వరూప స్వభావాదులను బాగుగ చింతన జేయవలెను. 'తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్' – అను పతంజలి యోగసూత్ర మీ భావమునే తెలుపుచున్నది.

'సముద్ధర్తా' – 'ఉద్ధర్తా' అని గాక సముద్ధర్తా అని పేర్కొనుటవలన అట్టి భగవదుపాసకులను తాను లెస్సగ సముద్ధరించెదనని భగవానుడు తెలిపినట్లైనది.

'మృత్యు సంసారసాగరాత్' – సంసారమును సముద్రమునకు పోల్చి చెప్పిరి. సముద్రమువలె భయంకరమై, కామాది, దుష్ట జల జంతువులతో గూడి అపారమైయుండుటవలన ఆ ప్రకార మది సాగరమునకు పోల్చి చెప్పబడినది. అయితే అనేకులు సంసారసుఖములు మహా ఆనందకరములని, కావున సంసార స్థితి అభిలషణీయమని పలుకుచుందురు. అజ్ఞానమువలననే వారట్లు చెప్పుచుందురు. సంసార స్థితి యొక్క వాస్తవ స్వరూపము వారి కింకను తెలియలేదని యర్థము. దాని యథార్థరూపమును భగవానుడిచట బయటపెట్టిరి – అది 'మృత్యు' సంసారమని వారు వర్ణించిరి. అనగా మరణరూపమైనదని, పుట్టుక చావులతో కూడినది యని భావము. కాబట్టి ఈ మృత్యుసంసారమధ్యమున తగుల్కొనిన జీవుడు అమరత్వసిద్ధికై అమృత స్వరూపుడగు భగవానుని, సచ్చిదానంద ప్రభువును తప్పక ఆశ్రయించవలసియున్నాడు.

'న చిరాత్' అని చెప్పుటవలన భగవదాశ్రయముచే జీవుడు శీఘ్రముగ విముక్తి నిందగలడని తెలియుచున్నది. (దృష్టాంతము – గజేంద్రుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, ద్రౌపది).

(తరువాయి వచ్చే సంచికలో)

# ఆంధ్రాక్షరములో మురువులొలుకు గుండ్రముత్తియములు!! తియ్యని ధనమే తెలుగుతనం!



ఇచ్ఛాపురం ఐచ్ఛిక విషయం తెలుగు. తడలో దడదడా మాట్లాడేది తెలుగు. ఆదిలాబాదయినా ఆముదాలవలస యినా, కాకినాడయినా, కరీంనగరయినా, ఆలంపూరయినా, అనంతపురమైనా జనం నోట జాలువారేది తెలుగు. మాండలికాలు మారవచ్చు. ప్రదేశాలు వేరుకావచ్చు. కాని ఆంధ్రులందరి ఊపిరి తెలుగు భాష. తల్లి వేరు సాక్షిగా మన స్వరతంత్రులు పలికే ప్రతీ మాట కోటి వరాలమూట. మనది రక్తసంబంధానికి మించిన భాషానురక్తబంధం. ఆ భాషే ప్రాతిపదికగా మనం తెలుగు రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన మన తేట తెలుగునూ, ఆ తెలుగు పంచే వెలుగునూ మరుస్తున్నాం.

నన్నయ్య అంటే ఆదికవి గుర్తొస్తాడు. కన్నయ్య అంటే కృష్ణపరమాత్మ సాక్షాత్కరిస్తాడు. అన్నయ్యా అని పిలిచా మనుకోండి. మనకంటే ముందు పుట్టినవాడో మనల్ని ముందుకు నడిపిస్తున్నావాడో అనురాగంతో పలకరిస్తాడు.

తీయందనమే 'తెనుగుధనం'. మన భాషామతల్లి ఒట్టి వెర్రిబాగులమ్మ. ఒకటో రకం సత్తెకాలపు మనిషి. లేకుంటే ఆదానం పేరిట ఇంట చొరబడిపోయిన ఏవేవో పదాలను ఆదరిస్తుందా! ప్రదానం మాటున ఎన్నోన్నో మాటల్ని ఎవరెవరికో ఎరువిస్తుందా!! ఇక తెలుగు కవిరాజుల సంగతీ చెప్పుకోవాలి. వీళ్లు తల్లి భాషతో తక్కువ ప్రయోగాలు చెయ్యలేదు. పద్యం అన్నారు. గద్యం అన్నారు. ప్రబంధం, కావ్యం, అవధానం, ఆశువు, గేయం, గీతం, నాటకం, సినిమా, కథ, నవల, పేరడీ ఇలా చాలా అన్నారు. అంతటితో ఆగలేదు. భావ, అభ్యుదయ, విప్లవ, జానపదం, ఒకటేమిటి లెండి... రకరకాల కవిత్వాలు ఆరబోశారు. ఈ సాహితీ రూపాలన్నీ గొప్పవే. మరలాంటప్పుడు వీటికి ఆలంబనగా నిలిచిన భాష అంతకంటే గొప్పదే! ప్రక్రియ ఏదయినా నేనున్నానంటే 'వెన్నుబలమిచ్చే నుడికారం తెలుగుకు దక్కిన సౌభాగ్యం! "ఆంధ్రాక్షరంబులు మురువు లొలుకు గుండ్రముత్తియములు" అన్నారు పెద్దలు. అక్షరాల స్వరూపమే కాదు. అనల్పార్థశక్తీ ఆణిముత్యమే. వీటి సాయంతో ఎవరు కలం కదిపినా రసరమ్య రచనలే వెల్లువెత్తుతాయ్. నాటి నేటి ఆంధ్ర సాహిత్యాన్ని అవలో కిస్తే అమ్మదనం, అమ్మబలం బోధపడతాయి. ఆంధ్రరాష్ట్రావతరణ సందర్భమున గుర్తుచేయాలి కదా!

శ్రీవాణి గిరిజాశ్చిరాయ వక్షా దధతో ముఖాంగేషు... అంటూ శ్రీకారం చుట్టి, భరతకథలో తెనుగు శ్రావ్యతను అణువణువునా రంగరించిన నన్నయ్యకు తొలి ప్రణామం. హరిహరనాథ తత్వాన్ని ప్రతిపాదించి, నాటి సమాజంలోని వైరుధ్యాలను తెగటార్చేందుకు తిక్కన్న పట్టిన దారి అనితరసాధ్యం. కిమస్థిమాలం కిము కౌస్తుభంవా... కింకాలకూటః... కింవా యశోదాస్తన్యం... ఆ అమాత్యుడు రంగనికి లింగనికి బేధం లేదని చెప్పడంలో తిక్కన భాషాసౌందర్యం బహుముఖం. **అంబ! నవాంబుజోజ్జ్వల కరాంబుజ! శారద చంద్ర చంద్రికా డంబర చారుమూర్తి...** ప్రబంధ పరమేశ్వరుడు ఎర్రాప్రగడ చదువుల తల్లిని కీర్తించిన వైనం భాషమ్మ నేర్పిన పదాలు ఆమెకే నివేదించిన చందం.

శ్రీనాథుని వంతు వచ్చేసరికి పద్యవిద్య అతగాడి అడుగులకు మడుగులొత్తింది. చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడు రచియించితి మరుత్తరాట్చరిత్ర... చెప్పేసుకున్నాడాయన. వచియింతు వేముల వాట భీమనభంగి నుద్ధండ లీల నొక్కొక్క మాటు... తన శక్తిని అమ్మ తోడ్పాటుతో జగద్విదితం చేసుకున్నాడు. తానేం తక్కువ తినలేదని **పోతన మాధుర్య మందార మకరంద భాషా సొగసులు గుప్పాడు. పలికెడి భాగవతమట పలికించెడె వాడు రామభద్రుండట..** తన కాతలె పైవాడి మీద పెట్టాడు. **బాల రసాలశాల నవపల్లవ కోమల కావ్యకన్య కన్...** ఎవరికో ధార పోస్తావా అంటూ సాహితీ లలామను స్తుతించాడు.

**ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర...** అన్న పెద్దన మనుచరిత్ర మన్నికైన చరితగా ప్రఖ్యాతమైంది. **జలజాతాసన వాసవాది సురపూజాభాజనంబై తరచ్చు...** ముక్కుతిమ్మన ఒద్దుగా ముద్దుగా పలికాడు. **రాజొకడూరలేదు చెలి ప్రాయువు బిత్తరి నీవు రూపురేఖాజిత మన్మథుండవు అన్నాడు చేమకూర వెంకటకవి.** తిమ్మన తెలుగునాట పారిజాతం చెట్టునాటితే... చెట్టేకాదు చేమ కూడ తన రూపంలో ఉందని వెంకటకవి ప్రకటించాడు. ఇలా కొప్పరపు కవులు, చిలకమర్తి, శ్రీపాద కృష్ణశాస్త్రి, తిరుపతి వేంకటకవులు, విశ్వనాథ సత్యనారాయణ, జాషువా, బోయిభీమన్న, జంధ్యాల పాపయ్య శాస్త్రి, శ్రీశ్రీ, దాశరథి, సి.నారాయణరెడ్డి వరకూ గల కవిరాజులెందరో అక్షర, భావ కనక పుష్య రాగాలుగా తెలుగు భాషా స్నిగ్ధముగ్ధ స్థిరత్వానికి రూపం గూర్చినవారే! వీరి కృషి చెరిగిపోతుందా, చెదలపాలవుతుందా? కాదు, కాబోదు. విర్రవీగి ఆంగ్ల మీసాలు పెట్టుకున్న కృద్ధులారా! తెలుగు తల్లికెంతటి అమాకత్వం ఉన్నదో, అంతటి ధృఢ కఠోరత్వమూ ఉంది.

'అమ్మా' అన్న తీయని పిలుపు ఎప్పుడు పోయిందో 'నాన్నా- అన్న' తండ్రి పిలుపు అప్పుడే పోయింది. అన్నా, తమ్ముడూ, అక్కా చెల్లీ, అత్తయ్యా, మామయ్య అనే తీపి పిలుపులు ఆవిరైపోయాయ్. అమ్మమ్మా, తాతయ్యా, బామ్మ లేదా నాయనమ్మ పిలుపులు మొదటికంటా పోయాయి. ఇప్పటి వేరు కుంపటి కుటుంబాల్లోని వారు తాతా, బామ్మా పేరులు ఎరుగరు.

అయితే తెలుగుదనపు తీయని తనమంతా తీయనైన తెలుగుభాషలోనే ఉందనీ ఎరుగరు! ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225